# అమర జవాన్ల త్యాగాలను దేశం మరువదు: చింతల



అమర జవాన్లకు నివాళులు అర్పిస్తున్న చింతల, గౌతంరావు

సైఫాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: దేశ రక్షణ కోసం మన అమర జవాన్లు చేసిన త్యాగం మరువలేనిదని పలువురు బిజెపి నాయకులు కొనియాడారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని వై జంక్షన్‌లో బిజెపి డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన పుల్వామాలో ముష్కర పిరికిపందల దాడిలో ప్రాణాలు కోల్పోయిన భరతమాత బిడ్డలు వీరసైనికులకు నివాళులు అర్పించిన సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అమర సైనికుల త్యాగాలను భారతదేశ ప్రజలు ఎన్నటికి మరువలేరని, వారి పోరాట స్ఫూర్తితో దేశ ప్రజలు అప్రమత్తంగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి అధ్యక్షుడు డా.ఎన్.గౌతంరావు, నాయకులు సందీప్‌సాయి, బంగారం చంద్రశేఖర్, గడ్డం వెంకటస్వామి, పందిళ్ళ ప్రసాద్, కేశబోయన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్ వార్త

## సంజీవయ్య దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయం



సంజీవయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సోసైటి నాయకులు

సైఫాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య 102వ జయంతి కార్యక్రమం మంగళవారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాం ఎదుట ఘనంగా జరిగింది. ఆల్ ఇండియా ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సోసైటి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సోసైటి జాతీయ అధ్య క్షుడు రాజువస్తాద్, కార్యనిర్వాహక అధ్యక్షుడు రాయకంటి నర్సింగ్‌రావు, సెక్రటరీ జనరల్ కె.బాలకృష్ణ తదితరులు మాట్లాడుతూ దేశంలోనే తిరుగులేని నాయకుడిగా ఎదిగిన సంజీవయ్య సేవలు చిరస్మరణీయమన్నారు. ఎపి ముఖ్యమంత్రిగా కొనసాగిన సంజీవయ్య పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం విశేషమైన సేవలు అందించారని, నమ్మిన సిద్ధాంతాల కోసం కట్టుబడి నీతి, నిజాయితిలతో పనిచేశారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సోసైటి నాయకులు బి.హరి కృష్ణ, పచ్చా శ్రీనివాసులు, బి.అనిల్ పాల్గొన్నారు. అంతకు ముం దు వారు సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## ఏ పదవిలో ఉన్నా ఆ పదవికి వన్నె తెచ్చిన గొప్ప వ్యక్తి కె.వి.రమణాచారి

**తెలంగాణ పోలీసు హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కొల్లేటి దామోదర్‌గుప్త**



హరికథ కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: ఏ పదవిలో ఉన్నా ఆ పదవికి వన్నెతెచ్చిన గొప్ప వ్యక్తి కె.వి.రమణాచారి అని తెలంగాణ పోలీసు హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కొల్లేటి దామోదర్‌గుప్త అన్నారు. మంగళవారం రాత్రి త్యాగరాయ గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి జన్మదినోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న సప్తాహం కార్యక్రమంలో భాగంగా బండి రాజుల శంకర్ ఆధ్వర్యంలో 'స్వామి వివేకానంద' బుర్రకథ, బండి రాజజుల శంకర్ రచించిన 'వివేకానంద సూక్తిశతి' గ్రంథావిష్కరణ కార్యక్రమం జరిగింది. గ్రంథాలను ఆవిష్కరించి అనంతరం ప్రసంగించారు. లెక్చరర్ స్థాయి నుంచి ఐఎఎస్ వంటి గొప్ప హోదా వరకు అధిరోహించిన మహోన్నత వ్యక్తి రమణాచారి అని అన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్సలర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ కడప జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పటి నాకు తెలుసునని, సచివాలయంలో ఉన్నతమైన పదవుల్లో ఆయన చూపించినపు ఔచిత్యం, హద్దులుదాటని మర్యాద ఎంతో గొప్పదన్నారు. గానసభ ఆధ్వర్యంలో కళలను పరిరక్షించడంతో కళాసామ్రాజ్యం విస్తరించేలా కృషి చేయడం అభినందనీయమన్నారు. స్వామి వివేకానంద సామాజిక చైతన్య ప్రవక్త అని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బుర్రకథ అందరిని ఆకట్టుకుంది.

## విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్ల ధర్నా



మైలార్ దేవ్‌పల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్‌లకు పిఆర్ సిని అమలు చేయాలని, 29 డిమాండ్‌లను పరిష్క రించాలని కోరుతూ మంగళవారం మధ్యాహ్నం రాజేంద్రనగర్ డివిజన్ విద్యుత్ కార్యాలయం వద్ద విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ 9హెచ్-82), ఇతెహాద్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యునియన్‌లు ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ అధ్యక్షులు రాజు మాట్లాడుతూ గత సంవత్సరం ఏప్రిల్ నుంచి పిఆర్‌సి అమలు కావలసి ఉన్నప్పటికి ఇంత వరకు యాజమాన్యం ప్రకటించక పోవటంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాణిక్‌రావు, షేక్ అహ్మద్, బాసిత్ అలీ, కిరణ్ కుమార్, అనిల్, యాకస్వామి, లక్ష్మీనారాయణ, విజయేందర్, రాములు, విజయలక్ష్మీతో పాటు పలువురు పాల్గొన్నారు. కాగా చార్మినార్ విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద మంగళవారం మధ్యాహ్నం ఆర్టిజన్లు తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. పలువురు ఆర్టిజన్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బండరాయితో కొట్టి యాచకుడి హత్య

**పారిపోయిన హంతకులు.. పోలీసుల గాలింపులు**

చిక్కడపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: బండరాయితో ఒకరిని హత్య చేసిన సంఘటన చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్ కుమార్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ హనుమాన్ దేవాలయం సమీపంలో ఫుట్‌పాత్‌పై ఉంటున్న కుంటి శ్రీను(30) పొట్టకూటి కోసం యాచకుడిగా ఉంటున్నారు. కాగా మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గాఢనిద్రలో ఉన్న కుంటి శ్రీను తలపై బండరాయితో మోదీ హత్య చేశారు. ఉదయం 6 గంటల నుంచే పెద్ద సంఖ్యలో హనుమాన్ దేవాలయానికి భక్తులు రావడంతో వెంటనే గమనించిన కొందరు భక్తులు డయల్ 100కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్ కుమార్, ఎస్‌ఐలు సందీప్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డిలు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని హత్యకు సంబంధించి వివరాల గురించి ఆరా తీశారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. హత్య చేసిన వ్యక్తుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, త్వరలోనే హంతకుని పట్టుకుంటామని సిఐ వివరిం చారు. కాగా సీసీఫుటేజ్ ఇతర ఆధారాలను సేకరిస్తున్నారని, క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించడం జరిగిందని వివరించారు. నాంపల్లి, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్ ఇతర ప్రాంతాలలో గాలిస్తున్నామన్నారు. చిక్కడపల్లి ఏసిపి యాదగిరి పర్యవేక్షణలో సిఐ ఎన్.సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# మందు.. మాదకద్రవ్యాలు

- **శివారు ప్రాంతాల్లో పేట్రేగుతున్న విష సంస్కృతి**
- **ఫాంహౌజ్‌లు, రిసార్టుల్లో అసాంఘీక కార్యకలాపాలు**
- **పేకాట స్థావరాలు, హుక్కా కేంద్రాలుగా మారుతున్నవైనం**
- **శని, ఆదివారాల్లో ప్రత్యేక ప్యాకేజీలతో యువతకు వల**
- **పక్కరాష్ట్రాల యువతులను రప్పించి అనైతిక కార్యక్రమాలు**
- **ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే స్పందిస్తున్న పోలీసులు**



ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే..

ఫాంహౌజ్‌లు, రిసార్ట్‌లలో అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా నిత్యం నిఘా వేయాల్సిన స్థానిక పోలీసులు నామమాత్రపు దాడులు నిర్వహిస్తూ నెలనెల మామూళ్లు అందుకుంటున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. అధిక మొత్తంలో మామూళ్లు చెల్లించిన వారికి, బడాబాబుల పార్టీలకు పోలీసులను రక్షణ కవచంగా ఉంచుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. యువతీ యువకులు రేవ్‌పార్టీల పేరిట పెడదారి పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. జంట నగరాల్లో నిత్యం కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు శివారు ప్రాంతాలపై దృష్టి సారించకపోవడంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారాంతపు రోజులు శని, ఆది వారాల్లో ఫాంహౌజ్‌లు, గెస్ట్‌హౌజ్‌లు అశ్లీల కార్యక్రమాలతో కిటకిటలాడుతున్నాయి. ఈ తరహా పార్టీలపై ఉక్కుపాదం మోపి విష సంస్కృతిని అడ్డుకోవాలని పోలీసులను కోరుతున్నారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త: బావలు సయ్యా.. మరదలు సయ్యా.. అంటూ పాటలు.. అసభ్య నృత్యాలు.. మందు.. చిందులు.. రేవ్‌పార్టీలు, ముజ్రాపార్టీలకు నగర శివారులోని కొన్ని రిసార్ట్‌లు.. అతిథిగృహాలు చిరునామాలుగా మారుతున్నాయి. వీకెండ్ వస్తే చాలు, హిందీ తమిళటీవీ ఛానెల్లు.. సినిమాల్లో కనిపించే కొందరు జూనియర్ ఆర్టిస్ట్‌లు, యువతులు అక్కడ సందడి చేస్తున్నారు. స్ట్రిప్‌టీజ్ నృత్యాలతో హాజరైన వారికి కిర్రెక్కిస్తున్నారు. చట్ట ప్రకారం అసభ్యకర నృత్యాలు, అనైతిక కార్యకలాపాలు నేరమని తెలిసినా ఆయా రిసార్ట్‌ల యజమానులు, రేవ్‌పార్టీలు, ముజ్రా పార్టీలు నిర్వహించేవారికి అద్దెకిస్తున్నారు. మరికొందరు యజమానులే వీటిని ఏర్పాటు చేస్తున్నారు. పోలీసుల దృష్టికి రాకుండా అనేకచోట్ల నిరాటకంగా కొనసాగుతున్నాయి. ఒక్కో వేడుకకు రూ.5లక్షల నుంచి 20లక్షల వరకు నిర్వాహకులు వెచ్చిస్తున్నారు. వచ్చిన అతిథులకు దిల్‌ఖుష్ చేసి పంపుతున్నారు. ఈసందడిలో మందు, మాదక ద్రవ్యాలు, అనైతిక కార్యకలాపాలు ఉండటంతో ఇంజనీరింగ్ విద్యార్థులు. యువకులు ఆకర్షితులవుతున్నారని పోలీసులు చెబుతున్నారు. ఢిల్లీ, ముంబై, నాగపూర్, పుణే, విజయవాడ వంటి నగరాల నుంచి నుంచి ముజ్రాలు, రేవ్‌పార్టీల్లో నృత్యాలు చేసే యువతులను నిర్వాహకులు రప్పిస్తున్నారు. అక్కడి వేశ్యవాటికల్లో ఉంటున్న యువతులు, వసతిగృహాల్లోని విద్యార్థులను. టీవీల్లో నటించే యువతులతో ఒప్పందాలు కుదుర్చుకుని తీసుకువస్తున్నారు. ఒక్కొక్కరికీ 30 వేల నుంచి లక్షవరకు చెల్లిస్తున్నారు. విమానాల ద్వారా రప్పించి కారులో నేరుగా రిసార్ట్‌లకు తరలిస్తున్నారు. పార్టీలు పూర్తయ్యాక మళ్లీ విమానాల్లోనే పంపుతున్నారు.

**సిటీలో అయితే ఆంక్షలు.. అక్కడైతే ఫ్రీగా ఉండొచ్చు**

ఇటీవల కాలంలో నగరంలో పబ్‌లు, హుక్కాసెంటర్‌లపై, పేకాట స్థావరాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతుండటంతో వీరు శివార్లవైపు చూస్తున్నట్లు తెలుస్తుంది. రాత్రింబవళ్లు చిత్తుగా మద్యం తాగుతూ అశ్లీల నృత్యాలతో శివార్లు శివాలెత్తుతున్నట్లు సమాచారం. తెల్లవారు జాము వరకు మద్యం సేవించి ఇంటికి వెళ్లే సమయాల్లో డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసులకు దొరికిన సంఘటనలు ఇప్పటికే అనేకం. ముఖ్యంగా నగర శివారు ప్రాంతాలు ముఖ్యంగా ఔటర్‌రింగ్ రోడ్డు అవతల ఉన్నటు వంటి మొయినాబాద్, శంకర్‌పల్లి, మహేశ్వరం, శంషాబాద్, చేవెళ్ల, శామీర్‌పేట్, పెద్దఅంబర్‌పేట్ ప్రాంతాల్లో ఫాంహౌజ్‌లు అధిక సంఖ్యలో ఉన్నాయి. ఇందులో కొన్ని రాత్రులు పబ్‌లుగా మారుతున్నాయి. ఫాంహౌజ్‌ల బుకింగ్ నుండి సకల సదుపాయాలు కల్పించేందుకు ప్యాకేజీలు ప్రకటిస్తూ అసాంఘీక కార్యకలాపాలకు ఆజ్యం పోస్తున్నారు. అంతే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి వివిధ రకాల సంగీత వాయిద్యాలతో పాటు యువతులను సైతం దిగుమతి చేస్తున్నారు.

అలాగే కొన్ని కార్పొరేట్ సంస్థల వారు తమ టార్గెట్లను సాధించామన్న ఆనందంతో శివారు ప్రాంతాలలో పార్టీలపేరుతో అశ్లీల కార్య క్రమాలు నిర్వహిం చుకుంటున్నారు. నగరంలో అయితే పోలీసులు ఆంక్షలు ఉంటున్నాయని ఆయా సంస్థలు శివార్లలోని ఫాంహౌజ్‌లనే పార్టీజోన్‌లు ఎంచుకుని అన్ని విధాలా సమకూర్చుకుంటున్నట్లు తెలుస్తుంది. అయితే ఇలాంటి పార్టీలు ఇటీవల కాలంలో ఎక్కువగా జరుగుతున్నా.. వేళ్లమీద లెక్కపెట్టేన్ని కేసులు మాత్రమే వెలుగులోకి వస్తుండటం విచారకరం. అసాంఘీక, అశ్లీల కార్యకలాపాలకు ఆయా ప్రాంతాల్లోని పోలీసులు కూడా తమదైన శైలిలో సహకరిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ప్రభుత్వం డీజెలను నగరంలో నిషేదించినా శివార్లలో ఇంకా మారుమోగుతునే ఉన్నాయి.

# ప్లాస్టిక్ ఫ్రీ సిటీకి ఆమడదూరం

**అన్ని చోట్లా అన్ని వస్తువులకూ ప్లాస్టిక్ సంచులే**

హైదరాబాద్, ఫిబ్రవరి14 ప్రభాతవార్త : కొనుగోళ్లు ఏవైనా అన్ని చోట్లా అన్ని వస్తువులకూ ప్లాస్టిక్ సంచులే దిక్కు అనేలా ఉంది. ఈ విపరిణామం మహానగరంతోపాటు శివారు మున్సిపల్ కార్పొరేషన్ల సిటీజనులకు శాపమే అవుతోంది. శివారు ప్రాంతాల్లో ప్లాస్టిక్ భూతం కోరలు చాస్తోంది. పేరుకు నిషేధం అమల్లో ఉన్నా బహిరంగ ప్రదేశాలు, నివాస సముదాయాలు, మార్కెట్లు, మాల్స్..ఎక్కడ చూసినా 50 మైక్రాన్ల లోపు మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. అనధికారిక అంచనా ప్రకారం సిటీజనులు రోజుకు రెండు కోట్ల ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. నిషేధం అమలులో జిహెచ్ఎంసి, శివారు మున్సిపల్ కార్పొరేషన్లు, పరిశ్ర మలు, పిసిబి తదితర విభాగాలు సీరియస్‌గా దృష్టి సారించకపోవడం..సిటీజనులు, వ్యాపారుల్లో అవగాహన లేమి నగరవాసుల పాలిట శాపంగా మారుతోంది. గ్రేటర్‌లో ప్లాస్టిక్ ఫ్రీగా మార్చాలన్న నిర్ణయం అమలు చేసే విషయంలో ఇటు ప్రభుత్వ విభాగాలు, అటు వ్యాపారుల, మరో వైపు పౌరసమాజం నిస్తేజంగా మారింది. దీంతో ఒకవైపు పర్యావరణం, మరోవైపు మానవ ఆరోగ్యం తీవ్రంగా ప్రభావితమవుతోంది.

**కోట్లలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం..** గ్రేటర్ జనాభా కోటికిపైగా చేరువైంది. ప్రతీ వ్యక్తి దైనందిన జీవితంలో కూరగాయలు, పండ్లు, ఇతర నిత్యావసర సరుకులు, షాపింగ్ అవసరాలకు సరాసరిన రెండు చొప్పున వివిధ మందాలు కలిగిన ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నట్లు పర్యావరణవేత్తతలు అంచనా వేస్తున్నారు. గ్రేటర్ పరిధిలో రోజుకు సుమారు రెండు కోట్ల ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తుండడం పల్ల అందోళన వ్యక్తం చేస్తున్నారు. వినియోగిస్తున్న కవర్లలోనూ 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల కవర్లే సింహభాగం ఉంటున్నాయి. ఈ కవర్లు గాలి, నీరు, నేత భూగర్భజల కాలుష్యానికి ప్రధానంగా కారణమవుతున్నాయని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తుండడం గమనార్హం. గ్రేటర్ పరిధిలో 50 మైక్రాన్లలోవున్న ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని విధించినప్పటికీ పూర్తిస్థాయిలో అమలవుతున్న దాఖలాలు కనిపించడం లేదు. బల్దియా, శివారు ప్రాంత మున్సిపాలిటీల అధికారులు దాడులు చేసి అక్రమార్కులపై తరచూ జరిమానాలు విధిస్తున్నప్పటికీ వ్యాపారుల్లో మార్పు కనిపించడం లేదు. ఇక మహానగరం పరిధిలో సుమారు వెయ్యికి పైగానే ప్లాస్టిక్ కవర్ల తయారీ సంస్థలుండగా..వీటిలో నిబంధల ప్రకారం అనుమతి పొందిన కంపెనీలు సగమైనా లేవన్నది పరిశ్రమల శాఖ వర్గాల వాదన. అంటే ప్లాస్టిక్ కవర్ల తయారీ మొదలు వినియోగం వరకు ఎక్కడా పటిష్ట నిఘా, నియంత్రణ, కఠిన శిక్షణలు, అవగాహన లేకపోవడంతో ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టడంలో ఆయా విభాగాలు చతికిలపడుతున్నట్లు స్పష్టమవుతోంది.

**ప్లాస్టిక్ కవర్లకు కేరాఫ్ అడ్రస్ ఈ ప్రాంతాలే..**

నగర శివార్లలోని పారిశ్రామిక వాడలైన కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి, జల్‌పల్లి, పాత నగరంలోని కొన్ని ప్రాంతాల్లో 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను ఉత్పత్తిచేసే కంపెనీలు సుమారు వెయ్యికి పైగానే ఉన్నాయి. ఇక వీటిపై హోల్‌సేల్ వ్యాపారం చేసేవారికి బేగంబజార్ ప్రధాన అడ్డగా కొనసాగుతుందని సమాచారం. వీటిల్లో నిత్యం 500-700 టన్నుల మేర ప్లాస్టిక్ కవర్లను ఉత్పత్తిచేసి వీటిని ఏపి, కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా రవాణాచేస్తున్నారు. వీరి ఆగడాలపై పరిశ్రమలశాఖ, పిసిబి, జిహెచ్ఎంసి, శివారు ప్రాంత మున్సిపల్ కార్పొరేషన్లు చూసీ చూడనట్లు వదిలేస్తుండడం గమనార్హం. గ్రేటర్ పరిధిలో సుమారు 6వేల కిలోమీటర్ల మేర మురుగునీటి పైపులైన్లు, మరో 1500 కిలోమీటర్ల మేర నాలాలు విస్తరించి ఉన్నాయి. ఇటీవల జిహెచ్ఎంసి, జలమండలి విభాగాలు ఆయా పైపులైన్లు, నాలాల్లో పూడిక తీత పనులు చేపట్టాయి. ఈ పనుల్లో భాగంగా తొలగిస్తున్న ఘన వ్యర్థాల్లో సుమారు 30 శాతం ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నట్లు సంబంధిత అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహ, వాణిజ్య, పారిశ్రామిక సముదాయాలు, మాల్స్, రెస్టారెంట్ల నుంచి పెద్దమొత్తంలో ప్లాస్టిక్ కవర్లు తొలుత చెత్తలో అటు నుంచి క్రమంగా మురుగునీటి పైపులైన్లు, నాలాల్లోకి చేరి..మురుగు ప్రవాహానికి తరచూ ఆటంకాలు తలెత్తుతున్నాయి. మురుగునీరు ఉప్పొంగి సమీప కాలనీలు, బస్తీలను ముంచెత్తుతుండడంతో స్థానికులు, పాదచారులు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నట్లు స్పష్టం చేస్తున్నారు.

# కరడుగట్టిన నేరస్తుడి అరెస్టు

- **రూ.లు.30లక్షల విలువగల సొత్తు స్వాధీనం**
- **రేప్ కేసులో ఏడేళ్ల జైలుజీవితం గడిపినా.. జల్సాలకు అలవాటుపడి**
- **జీడిమెట్ల పోలీసుల ప్రత్యేకశ్రద్ధతో తిరిగి కటకటాల్లోకి**




వివరాలు వెల్లడిస్తున్న డిసిపి శ్రీనివాసరావు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : ఒక రేప్‌కేసులో ఏడేళ్ల జైలుజీవితం అనుభవించిన ఓ ఘరానా నేరస్థుడు జల్సాలతో జీవితం సాగించాలని భావించి హైదరాబాద్‌లోని సైబరాబాద్‌లతో పాటు రాచకొండ కమీషనరేట్‌లతోపాటు కామారెడ్డి జిల్లాలోనూ ఇళ్లలో దొంగతనాలకు పాల్పడి ఓ ఘరానా నేరస్తుడిని పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. బాలానగర్ పోలీసు డిప్యూటీ కమిషనర్ టి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం బాలానగర్ డిపిసి కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రంలోని జోషినగర్ సమీపంలోని బాల్కి గ్రామానికి చెందిన కమ్మాసింగ్ అలియాస్ కరణ్‌సింగ్ అలియాస్ ధరమ్‌సింగ్ అలియాస్ ఆనంద్‌సింగ్‌గా వివిధ పేర్లతో పిలవబడుతూ మొదటగా స్టీల్ సామాన్లతయారీని వృత్తిగా చేసుకుని జీవించేవాడు. దీనితో ఆదాయం సరిపోకపోవడంతో పాటు ఎలాగైనజల్సాలు చేయాలనే తపనతో అనేక దొంగతనాలకు పాల్పడేవాడు. సైబరాబాద్, హైదరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్‌ల పరిధిలలోని జీడిమెట్ల, జగద్గిరిగుట్ట, చిలకలగుడ, తుకారంగేట్, మల్కాజ్‌గిరి, కామారెడ్డిటౌన్ పోలీస్‌స్టేషన్లలోని ఇళ్లలో దొంగతనాలకు పాల్పడి జల్సా చేసి జీవించేవాడు. ఇతడు ఏడేళ్ల జైలుజీవితం గడిపిన అనంతరం కూడా ఇతడి ప్రకర్తనతో మార్పురాకపోగా ఎలాగైనా దర్జాగా బతకాలనే ఆశతో వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలలోని తాలాలు వేసి వున్న ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. జీడిమెట్ల పోలీస్ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ ఎం.పవన్, డిటెక్ట్వు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణలు ఒక ప్రత్యేక బృందంగా డిటెక్ట్వు సబ్‌ఇన్‌స్పెక్టరు ముంత ఆంజనేయులుతో కలిసి ఒక కేసు విచారణ విషయంలో సూరారం ఓంజెండా సమీపంలోని గుడెసెలో వుంటున్న కమ్మాసింగ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తీగెలాగితే డొంకకదిలిన చందంగా భారీకేసుల గుట్టు రట్టైంది. జల్సాలకు అలవాడుపడిన కమ్మాసింగ్ వివిధ ప్రాంతాలలో దోచుకున్న వస్తువులను చాకచఖ్యంగా అవసం మేరకు విక్రయించి మిగిలిన సొత్తును దాచుకునేవాడని తేల్చారు. పట్టుబడ్డ నేరస్తుడి నుండి 316గ్రాముల బంగారం, ఒక కిలో 26గ్రాముల వెండి ఆభరణాలు, రూ.లు.15లక్షల నగదు కాలిసి మొత్తం రూ.లు.30లక్షల విలువైన వస్తువుతను పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. ఈమేరకు బాలానగర్ సహాయ పోలీసు కమిషనర్ ఆస్లాగంగారామ్, జీడిమెట్ల సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.పవన్, డిటెక్ట్వు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, డిటెక్ట్వు సబ్‌ఇన్‌స్పెక్టర్ ముంత ఆంజనేయులు తమ బృందంతో చాకచక్యంగా నేరస్తుడిని అరెస్టుచేయడంపట్ల బాలానగర్ డిప్యుటీ పోలీసు కమిషనర్ శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

## సింహవాహినీ మహాంకాళీ అమ్మవారి దేవాలయం అభివృద్ధికి స్థానిక ప్రజలు సహకరించాలి

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

చార్మినార్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : పాతబస్తీ లాల్‌దర్వాజ శ్రీ సింహవాహినీ మహాంకాళీ అమ్మవారి దేవాలయం అభివృద్ధికి స్థానిక ప్రజలు సహకరించాలని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. మంగళవారం మాసాబ్‌ట్యాంక్‌లోని తన కార్యాలయంలో ఆలయ కమిటి సభ్యులు, ఆలయ విస్తరణ కోసం సేకరించాల్సిన స్థలాల యజమానులతో కలిసి ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ లాల్ దర్వాజ శ్రీ సింహవాహినీ మహాంకాళీ అమ్మవారి దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేయాలనే ప్రభుత్వం నిర్ణయంతో ఆలయాన్ని ఆనుకుని ఉన్న కొన్ని నిర్మాణాలను సేకరించటం జరిగిందని తెలిపారు. సంబంధిత యజమానులకు ప్రభుత్వం తగిన న్యాయం జరిగే విధంగా పరిహారం అందిస్తుందని ఆయన తెలియజేశారు. స్థలాన్ని ఇచ్చే భూమి యజమానులకు ఇప్పటికే ప్రభుత్వం 9 కోట్ల రూపాయలను విడుదల చేసిందని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల, ఆలయ కమిటి చైర్మన్ సురేందర్, ప్రతినిధులు రాజ్ కుమార్, బద్రినాథ్, జగదీష్, రాజు యాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## జింఖానా గ్రౌండ్‌లో ఈ నెల 15 నుంచి 19 వరకు మహా శివరాత్రి వేడుకలు



విలేకర్ల సమావేశంలో ప్రసంగిస్తున్న బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: మహా శివరాత్రి పర్వదినాన్ని పుర స్కరించుకొని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19 తేదీ వరకు ఒసికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో మహా శివరాత్రి వేడుకలు బారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు బ్రహ్మకుమారీస్ ఇన్‌ఛార్జిలు మంజూ దీది, మమతలు తెలిపారు. ఈ ఉత్సవ వేడుకల ప్రారంభోత్సవానికి రాష్ట్ర గవర్నర్ తమిళ్‌సై సౌందర్ రాజన్, రాష్ట్ర మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పువ్వాడ అజయ్ కుమార్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న, ముగింపు ఉత్సవాలకు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిలు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా 66 అడుగుల ఎత్తులో మహా శివలింగ ద్వాదశ జ్యోతిర్ లింగను ప్రతిష్ఠించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ శ్వేత, సునీల, సుహాస్‌లు పాల్గొన్నారు.

## ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరికి రిమాండ్

**ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లు, 3.75కేజీ గంజాయి స్వాధీనం**

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న సంఘటన మంగళవారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లంపేట్ నుంచి బొల్లారం వైపు వెళ్ళే రహదారిలో రూట్‌వాచ్ నిర్వహిస్తున్న సమయంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. ఆ ఇద్దరు వ్యక్తులను పోలీసులు తనిఖీలు చేయగా వారి వద్ద 3.75కేజీల ఎండు గంజాయి లభించింది. వెంటనే నిందితులను అదుపులోకి తీసుకొని విచారించి బీహెచ్ఈఎల్ ప్రాంతానికి చెందిన బ్రజేందర్‌కుమార్(39), పఠాన్‌చెరువుకు సూరజ్‌కుమార్ బిహారి(34) లుగా గుర్తించారు. నిందితుల నుంచి పాషన్ ప్రో ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లు, ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్నవారిలో ప్రొబేషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.మాధయ్య, పేట్‌బషీరాబాద్ ఎస్‌హెచ్ఓ టి.యాదయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## 25 లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



డ్రైనేజీ పైప్‌లైన్ ప్రనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హైదరాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: కాచిగూడ డివిజన్‌లోని కాశీరాంజీరా లైన్‌లో 25 లక్షల రూపాయల నిధులతో నూతనంగా వేయనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆ ప్రాంతంలో పాదయాత్ర నిర్వహించి స్థానిక ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం కెసిఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు అన్ని రకాలుగా మేలు చేసే సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నదని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కారిస్తామన్నారు. ఆయన సంబంధింత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ ఉమారమేష్‌యాదవ్, వాటర్ వర్క్స్ అధికారులు సన్యాసిరావు, భావన, జిహెచ్‌ఎంసి అధికారులు సువర్ణ, దుర్గాప్రసాద్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌లో మంచినీటి సమస్య పరిష్కరిస్తా : ఎమ్మెల్యే సాయన్న



మంచినీటి సమస్య పరిష్కారంపై ఎమ్మెల్యే సాయన్నకు వినతిపత్రం అందజేస్తున్న సామాజిక కార్యకర్త తేలుకుంట

కంటోన్మెంట్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో రోజు విడిచి రోజు మంచినీటిని సరఫర చేయించాలని, అదే విధంగా ఉచిత మంచినీటి సరఫర కోసం ఆధార్ కార్డు వంటి లింక్ లేకుండా ప్రతి ఇంటికి మంచినీటిని సరఫరా చేయించాలని కోరుతూ ప్రముఖ సామాజిక కార్యకర్త తేలుకుంట ఎసతీష్ గుప్త ఆధ్వర్యంలో మంగళవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్నకు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా 5వ వార్డులో వారానికి ఒకసారి మంచినీరు సరఫర కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందు వల్ల రోజు విడిచి రోజు మంచినీటిని సరఫర చేయడంతో పాటు ఆధార్ కార్డు లింక్ లేకుండా ఉచిత మంచినీటిని సరఫర చేయాలన్నారు. వెంటనే సాయన్న స్పందించి జలమండలి ఉన్నతాధికారులతో చర్చించి మంచినీటి సమస్య తలెత్తకుండా రోజు విడిచి రోజు మంచినీరు సరఫర అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## అంగన్‌వాడి సిబ్బంది సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

**మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి**



ధర్నాలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

ధర్నాచౌక్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త: అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఇందిరాపార్కు వద్ద తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటియూ) ఆధ్వర్యంలో ఐసిడిఎస్ ను రక్షించాలని, అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిధిగా హాజరై జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించటం పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన జాతీయ విద్యా విధానం ద్వారా ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీఐటియూ రాష్ట్ర కార్యదర్శి జే.వెంకటేష్, అంగన్వాడి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.పద్మ, ప్రధాన కార్యదర్శి పి.విజయలక్ష్మి, నాయకులు కే.సునీత, జి.కవిత, జి.పద్మ, ఈ. వెంకమ్మ, నర్సమ్మ, కోటేశ్వరి, శారద, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## చెన్నవ కేశవ స్వామి దేవాలయంలో వైభవంగా బ్రహోత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర విద్యా సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పుస్తె శ్రీ కాంత్, జుర్కి రాజేందర్

చార్మినార్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : పాతబస్తీ కేశవగిరి శ్రీ చెన్న కేశవ స్వామి దేవాలయంలో మంగళవారం అత్యంత వైభవంగా శ్రీ చెన్న కేశవ స్వామి కళ్యాణ మహోత్సవం జరిగింది. రాష్ట్ర విద్యా సంక్షేమం, మౌళిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఆర్.శ్రీధర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి పుస్తె శ్రీకాంత్‌తో పాటు పలువురు పాల్గొని దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది శ్రీ చెన్న కేశవ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని చాంద్రాయణగుట్ట డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు జుర్కి రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ చెన్నవ కేశవ స్వామి దేవాలయం కమిటి చైర్మన్ జుర్కి సంతోషి రాణి, బిఆర్ఎస్ నాయకులు జుర్కి రాజేందర్, గడ్డం సత్యనారాయణ పాల్గొన్నారు.

## జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు వేదికగా హైదరాబాద్

**శాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్**



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆంజనేయగౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త: స్వరాష్ట్రంలో నలువైపులా అభివృద్ధిలో దూసుకుపోతున్న హైదరాబాద్ నగరం జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు వేదిక మారడం శుభ పరిణామమని శాట్స్ చైర్మన్ ఆంజనేయులుగౌడ్ అన్నారు. మంగళవారం ఎల్బీస్టేడియంలోని శాట్స్ కార్యాలయంలో 5వ జాతీయ స్థాయి తైక్వాండో క్యాడెట్ పోటీకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. 24,25,26 తేదీల్లో గచ్చిబౌలి స్టేడియంలో బాల, బాలికల విభాగంలో జరిగే పోటీల్లో అన్ని రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈసందర్భంగా ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడ అయిన త్వైకాండోతోపాటు వివిధ క్రీడా అసోసియేషన్‌ల సారథ్యంలో ఏడాది పొడవునా వివిధ క్రీడా విభాగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలు తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్నాయని అన్నారు. ఇటీవల బోపాల్‌లో జరిగిన ఖేలో ఇండియా క్రీడా పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు 25పథకాలు సాధించి రాష్ట్రానిని మంచి ర్యాంకు సాధించిపెట్టారన్నారు. ఈకార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డి.సతీష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, యూనివర్సిటీ పిజికల్ డైరెక్టర్ బాబ్‌లాల్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## డబీర్‌పుర పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే పాషా ఖాద్రి నిరసన

చార్మినార్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసుల తీరుపై మండి పడుతూ ఎంఐఎం ప్రధాన కార్యదర్శి, యాకుత్‌పుర నియోజకవర్గం శాసన సభ్యులు సయ్యద్ అహ్మద్ పాషాఖాద్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఎమ్మెల్యే పాషాఖాద్రి డబీర్‌పుర పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ పోలీసుల తీరుకు నిరసనగా భైఠాయించి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రి మాట్లాడుతూ చలాన్ల పేరుతో ట్రాఫిక్ పోలీసులు పాతబస్తీ ప్రజలను వేధిస్తున్నారని తెలిపారు. కాగా డబీర్‌పుర ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు ఫుట్‌ఫాత్‌ను ఆక్రమించిన వారిపై 341,383,66జి సెక్షన్ల కింద మీర్‌చౌక్ పోలీసులు కేసు నమోదు చేశారు. మీర్‌చౌక్ ఎసిపి దామోదర్ రెడ్డి డబీర్‌పుర పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఎమ్మెల్యే పాషాఖాద్రితో మాట్లాడి నచ్చచెప్పటంతో పరిస్థితి సద్దుమణిగింది.



సైక్లాథాన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి

## ఘనంగా ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: అజాది కా అమృత్ మహోత్సవాలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం కోఠిలోని రిజినల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో పలు వైద్య సేవా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఉదయం అఫ్జల్ గ్రంథాలయం వద్ద సైక్లాథాన్ కార్యక్రమం జరిగింది. అనంతరం సుల్తాన్‌బజార్‌లోని ప్రభుత్వం హైస్కూల్ విద్యార్థులకు పౌష్టికాహారంపైన అవగాహన కార్యక్రమం, అలాగే కుష్ఠు వ్యాధిపై సంపూర్ణ అవగాహన, ఉచితంగా మందులు పంపిణి, నివారణతోపాటు పూర్తి అవగాహన కార్యక్రమాన్ని డాక్టర్లు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సెంటర్ మెడికల్ ఆఫసీర్ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి, కింగ్‌కోఠి ఎస్ఆర్‌హెచ్‌ఓ డాక్టర్ పద్మజా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆగిపోయిన పనులను వారంరోజుల్లో పూర్తి చేయాలి



మున్సిపల్ అధికారులతో చర్చిస్తున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: మధ్యంతరంగా ఆగిపోయిన పనులను వారం రోజుల్లోగా పూర్తిచేసి ప్రజలకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని హిమాయత్ నగర్ డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. డివిజన్‌లోని హరివీర్‌కాలనీలో ఇటీవల కాలంలో కొత్తగా పైప్‌లైన్ పనులను ప్రారంభించి దాన్ని పూర్తి చేయకుండానే అర్ధాంతరంగా కాంట్రాక్టర్ ఆపివేశారు. దీంతో స్దానికులు ఇబ్బందులకు గురువుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకొని కార్పోరేటర్ మంగళవారం మున్సిపల్ అధికారులు దుర్గాప్రసాద్, దివ్య, శివ జలమండలి మేనేజర్ మహేందర్‌రెడ్డిలను ఆమె పిలిపించారు. మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు జి.రామన్‌గౌడ్, నర్సింగ్‌గౌడ్, మహేష్, లాల్, జైస్వాల్, కొండయ్య, శేఖర్, ప్రవీణ్, జై, రాజుగౌడ్, భాను తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ భవన్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు

**ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్**



డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, గద్దర్

ధర్నాచౌక్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త: అంబేద్కర్ భవన్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడతామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హామీ ఇచ్చారు. మంగళవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర డైరీని ప్రజా గాయకుడు గద్దర్, టిఎస్ఎంఐడిసీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపాల్ మాట్లాడుతూ బహుజనులకు ఉపయోగపడే చట్టాలను, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల వివరాలను పొందుపరిచి ప్రతి సంవత్సరం ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ డైరీ తీయటం అభినందనీయమని కొనియాడారు. సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు సుదర్శన్‌బాబు అధ్యక్షతన జరిగిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఐఎస్సీ ఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు రాగాల నాగేశ్వర్ రావు, కళానిధి మాస్టర్‌జీ, చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, రాష్ట్ర నాయకులు కే.వినోద్‌కుమార్, దాసరి రవీందర్, కే.వినోద్‌కుమార్, రుద్రారం శంకర్, పరంజ్యోతి, జి.ఎస్. వీణ, గుంటి విజయ్‌బాబు, కుర్మ మహేందర్, పరశు రాముడు, దర్గ కరుణాకర్, గంగం శివశంకర్, దాసరి యాదగిరి, బట్టు క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల ఉద్యోగులను ఆదుకుంటాం : శంకర్

కంటోన్మెంట్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: గ్రేటర్‌లోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వికలాంగుల ఉద్యోగులకు ఎల్లప్పుడు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని గుర్తింపు పొందిన బి.ఎం.ఇ.యు అధ్యక్షులు శంకర్ అన్న తెలిపారు. మంగళవారం గ్రేటర్‌లో పనిచేస్తున్న వికలాంగుల ఉద్యోగులు బిఎంఇయులో చేరారు. ఈ సందర్భంగా వారికి శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి యూనియన్‌లో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ అస్రఫ్, ప్రధాన కార్యదర్శి మోహిన్, భూషన్, జోనల్ అధ్యక్షులు కె.ప్రకాశ్, నర్సింగ్, నాయకులు బాల్‌రాజ్, క్రిష్ణ, పాండు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా : కొంతం దీపిక



ఈస్ట్ మారేడ్‌పల్లిలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కొంతం దీపిక తదితరులు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: ఈస్ట్ మారేడ్‌పల్లిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. మంగళవారం ఆమె వెస్ట్ మారేడ్‌పల్లిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్థంగా ఉన్నాయని స్థానికులు అమె దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు విక్రమ్, సుబ్రమణ్యం, మహావీర్, సాజీద్, క్రిష్ణ, మూర్తి పాల్గొన్నారు.

## నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

నార్సింగి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : విద్యుత్ లైన్ల మధ్య మరమ్మత్తుల కారణంగా నేడు ఈ క్రింది ప్రాంతాలలో కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నామని నార్సింగి విద్యుత్ సెక్షన్ ఎఇ సందీప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఇబ్రహీంబాగ్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రాందేవ్ గూడ, ఇబ్రహీంబాగ్, అలిజాపూర్, పాషాకాలనీ, నెక్‌నాంపూర్, తారామతి బారాదరి, వెసెల్ల మెడోస్ ప్రాంతాలలో కరెంటు కోత విధించబడుతుందని, ఇందుకు వినియోగదారులంతా తమకు సహకరించాలని ఏఈ కోరారు.

**హిమాయత్ సాగర్‌లో..** 33/11.కేవీ ఇబ్రహీంబాగ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సైతం ఈ రోజు మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి సాయంత్రం 6.గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయిరాంనగర్, వీరాకాలనీ, సన్‌సిటీ ప్రధాన రోడ్డు, పిఅండ్‌టీ కాలనీ, ఆర్మీస్కూల్, మాధవీనగర్ ప్రాంతాలలోని వినియోగదారులు తమకు సహకరించాలని ఏఇ సూచించారు.

## సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం : పద్మశ్రీ ఖాదర్ వలీ పిలుపు




హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త: నిత్యం అనుక్షణం బిజీగా ఉండే జర్నలిస్టులు సిరిధాన్యాల వంటకాలు తినటం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలీ పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్ హైదరాబాద్, రైతునేస్తం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమాజిగూడలో పాత్రికేయులకు మంగళవారం సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వలీ మాట్లాడుతూ అందు కొర్రలు, సామలు, అరికెలు, ఊదలు చిరుధాన్యాల్లో పుష్కలమైన ఫైబర్ ఉంటుందని వలి వివరించారు. జర్నలిస్టులు తీవ్రమైన ఒత్తిడిలో మధుమేహానికి గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చిరుధాన్యాల ఆహారం నిరంతరం తీసుకోవడం వల్ల మధుమేహం మటుమాయం చేయవచ్చునని దీన్ని శాస్త్రీయంగా కూడా నిరూపించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రైతు నేస్త ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ యడవల్లి వెంకటేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగుతో అంధత్వాన్ని తరిమివేద్దాం

**గండిపేట్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు ఆర్.నర్సిహ్మ**



ఖానాపూర్‌లో కంటి వెలుగు కేంద్రంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న మాజీ సర్పంచ్‌లు మల్లేష్, నర్సిహ్మలు

నార్సింగి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : కంటి వెలుగుతో ప్రజలను అంధత్వానికి దూరం చేద్దామని గండిపేట్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు, ఖానాపూర్ మాజీ సర్పంచ్ రామేశ్వరం నర్సిహ్మ పేర్కొన్నారు. మంగళవారం ఖానాపూర్ గ్రామంలో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి తలారి మల్లేష్ ముదిరాజ్, మాజీ సర్పంచ్‌లు రామేశ్వరం నర్సిహాహ్మ, గండయ్య ముదిరాజ్, కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డిలు తమ కళ్లను పరీక్షించుకున్నారు. అనంతరం నర్సిహ్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికి కంటి పరీక్షలు నిర్వహించి, అంధత్వంను దూరం చేసేందుకు సీఎం కేసీఆర్ కంటి వెలుగును ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారన్నారు. నిష్ణాతులైన కంటి వైద్యుల సహాయంతో గ్రామ గ్రామాన కంటి వెలుగు కేంద్రాలు పెట్టి ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి కంటి అద్దాలు సైతం ఉచితంగానే అందజేస్తున్నారని తెలిపారు. గ్లూకోమా, క్యాటరాక్ట్ వంటి ఇబ్బందులున్న వారికి శస్త్ర చికిత్సల నిమిత్తం సమీపంలోని కంటి ఆసుపత్రులకు పంపిస్తున్నారని వివరించారు. ఖానాపూర్ గ్రామ ప్రజలందరూ ఈ కేంద్రానికి వచ్చి తమ కళ్ల చూపును పరీక్షించుకోవాలని, ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని నర్సిహ్మ సూచించారు. ఈ కార్యక్రమంలో కంటి వెలుగు కేంద్రం డాక్టర్ తైసీన్‌బేగం, అన్నపూర్ణ, ప్రణీత్, సుజాత, ధన్నీభాయి, మోహన్, ఆశాలు కవిత, జ్యోతి, లావణ్య, పద్మ, పుర ప్రముఖులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ ఆలోచనలు నేటి సమాజానికి ఎంతో అవసరం: ఇటి నర్సింహా



శివాజీ కటౌట్‌ను ఆవిష్కరిస్తున్న ఇ.టి.నర్సింహా

సైఫాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: రైతు బాంధవుడు, మత సామరస్యాన్ని పెంపొందించిన బహుజన చక్రవర్తి ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని మంగళవారం విజయనగర్ కాలనీలోని సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన కటౌట్‌ను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలో జన్మించిన శివాజీ ఒక స్వతంత్ర రాజ్యనిర్మాణం కోసం అహర్నిషలు కష్టపడి పనిచేసి ఆనేక యుద్ధాల్లో విజయం సాధించి తనకంటు ఒక రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. నాటి సనాతన బ్రాహ్మణ ఆచారాలు శివాజీని రాజుగా అంగీకరించలేదని పైగా పట్టాభిషేకం చేయడానికి నిరాకరించారని ఆరోపించారు. బ్రాహ్మణులు, క్షత్రియులు మాత్రమే రాజ్యానికి చక్రవర్తులుగా, అధిపతులుగా కొనసాగుతున్నటువంటి వ్యవస్థలో శూద్ర కులానికిచెందిన శివాజీని రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ఆనేక ఇబ్బందులకు గురిచేశారని ఆయన తెలిపారు. నాడు గ్రామాలలో కొనసాగుతున్న పటేల్, పట్వారి, జాగిర్దార్, పాటిల్ వంటి వాళ్ళ దుర్మార్గమైన పీడనకు శివాజీ స్వస్తి పలికారని, రైతులు పండించిన పంటలను పెద్ద మొత్తంలో భూస్వాములు దోచుకోవడమే కాకుండా తీవ్రమైన పన్నులు విధించేవారని, శివాజీ ఈవిషయంలో రైతులందరితో మాట్లాడి శిస్తులను, పన్నులను తగ్గించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, కార్యవర్గ సభ్యులు ఎం,నర్సింహా, శ్రీకాంత్, మామిడి చెట్ల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీలు, బిసిల మధ్య ఘర్షణలు పెట్టొద్దు: బి.రఘు డిమాండ్

సైఫాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: గిరిజనులు, బిసిల మధ్య ఘర్షణలు పెట్టే కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని, 7 కులాలను ఎస్టీ జాబితాలో చేర్చుతూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెంటనే ఉపసంహరించుకరోవాలని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బి.రఘు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు కొన్ని కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రయత్నించి విఫలం చెందాయని, ఎస్టీ జాబితాలో చేర్చాలంటే వారి యొక్క (లిపిలేని) భాష, వారి సంస్కృతి, సాంప్రదాయులు, వారి జీవన విధానం, ఆర్థికంగా వెనుకబడిన తెగలను గుర్తించే విధంగా కేంద్ర ప్రభుత్వంకు పరిమితి ఉంటుందన్నారు. కాని ఆయా రాష్ట్రాలలో ఓట్ల కోసం ఆ కులాలను మధ్యపెడుతూ తెగల మధ్య ఘర్షణ పెట్టి ఓట్ల కోసం రాజకీయం చేయడం మంచిదికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో చేసిన హామీల ప్రకారం గిరిజనులకు విద్యా, ఉద్యోగ రంగాలలో పది శాతం రిజర్వేషన్‌లను కల్పించాలని, అలాగే ఇతర డిమాండ్లను అమలు చేయాలని కోరారు. లేని పక్షంలో అన్ని గిరిజన సంఘాలతో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని రఘు హెచ్చరించారు.

## కన్నులపండువగా శ్రీసంగమేశ్వరస్వామి మహాశివరాత్రి-చతుర్ధశ వార్షిక బ్రహ్మోత్సవాలు



నాంపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ నిర్వహణలో గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ సమీపంలో అతిపురాతన శ్రీ సంగమేశ్వరస్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి వార్ల దేవాలయంలో ఈ నెల 16 గురువారం నుండి 19 ఆదివారం వరకు శ్రీ సంగమేశ్వరస్వామి వారి మహాశివరాత్రి, చతుర్ధశ వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి, ఆలయ కమిటీ తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా నిత్యహోమముతో పాటు మహాన్యాసపూర్వక ఏకాదశ, ఏకవార రుద్రాభిషేకాది ప్రత్యేక పూజలు నిర్వహించబడతాయని, 16న సాయంత్రం 5.30లకు గణపతిపూజా, పుణ్యాహావాచనం, ఋత్విగ్వరణం, మృత్సంగ్రహణం, అంకురారోపణ, అఖండ దీపారాధన, వాస్తుపూజ, వాస్తుహోమం, ధ్వజపటాధివాసము, తీర్థప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 17న ఉదయం 8.30లకు యాగశాల ప్రవేశం, సోమ కుంభ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, గణపతిహోమము, మూలమంత్ర, మూర్తిమంత్ర హోమములు, ధ్వజాధిహోమము, ధ్వజారోహణము, రాత్రి 7ల నుండి భేరిపూజ, భేరి తాడనము, నిత్య హోమము, నిత్య పూర్ణాహుతి, బలిహరణము, నివేదన, తీర్థప్రసాద వితరణలు; 18న ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకము, ఉదయం 7.30 రాత్రి 9గంటలకు ఏకవార రుద్రాభిషేకములు; చివరిరోజు 19న ఉదయం 9ల కు అన్నాభిషేకము, 10.30ల నుండి మహాపూర్ణాహుతి, ధ్వజావరోహణము, 11లకు తులసీతీర్థం, మధ్యాహ్నం 12గంటల నుండి నివేదన, నీరాజనము, మంత్రపుష్పము, ఆశీర్వచనము, వేదపండిత సత్కారం, తీర్థప్రసాద వితరణానంతరం ఉత్సవ పరి సమాప్తి అవుతాయని కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి వివరించి, అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి ఆయా పూజాది కార్యక్రమాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొని ఆ పరమశివుని అనుగ్రహపాత్రులు కావాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

**భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) జాతీయ నాయకుడు కె లక్ష్మారెడ్డి**



మహాధర్నాలో అభివాదం చేస్తున్న బీఎంఎస్ నేతలు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడుదామని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) జాతీయ నాయకుడు కే.లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక విధానాలను నిరసిస్తూ బీఎంఎస్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేసించి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బి.రవీంద్రరాజు, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్.మల్లేశం మాట్లాడుతూ రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమలను తక్షణమే తెరవాలని, సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయటం పట్ల సీఎం కేసీఆర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కనీస పనికి కనీస వేతనం ఇవ్వాలనే సుప్రీం కోర్టు తీర్పును కూడా పట్టించుకోకుండా గత ఎనిమిది సంవత్సరాలుగా కనీస వేతనాల నోటిఫికేషన్లు సీఎం టేబుల్‌పై పెండింగ్‌లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ, అమలాపురం బిల్ట్ కంపెనీలు మూసివేయటం వల్ల దాదాపు యాభై వేల మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని గుర్తు చేశారు. ఉద్యమాలు చేపడితే కార్మిక సంఘాలను రద్దు చేయటం అంటే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయటమేనని ధ్వజమెత్తారు. ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డిఏ లను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ మహాధర్నాలో బీఎంఎస్ దక్షిణ క్షేత్ర సంఘటన కార్యదర్శి దురైరాజ్, జాతీయ కార్యవర్గ సభ్యులు ఏ.సుబ్రమ్మాణ్యం, ఏ.చెన్నకేశవరావు, రవిశంకర్, బిపిటిటిఎం రాష్ట్ర ప్రధన కార్యదర్శి టి.రాంరెడ్డి, ఉపాధ్యక్షులు సుధాకర్, భూలోకేశ్వరి, మంజుల, కార్యదర్శులు కే.రాంమోహన్, పి.లక్ష్మీనారాయణ, రమేష్, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ కాశీంపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి



ప్రసంగిస్తున్న తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి(టిఎంపిఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు గారె వెంకటేశ్ మాదిగ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: ప్రొఫెసర్ కాశీంపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి(టిఎంపిఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు గారె వెంకటేశ్ మాదిగ డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లిలోని టిఎంపిఎస్ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్ మాదిగ మాట్లాడుతూ ప్రొఫెసర్ కాశీం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శాంతియుతంగా చేస్తున్న దీక్షను పోలీసులు భగ్నం చేసి అక్రమ కేసులు పెట్టడం దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయకుండా విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వతీరుకు నిరసనగా కాశీంపై అక్రమ కేసులు పెట్టడం నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రంగా విద్యార్థి పోరాటాలు ఉదృతం చేసి ఆంద్రపాలకులను తరిమికొట్టి రాష్ట్రాన్ని సాధించుకున్న ఉస్మానియా వర్సిటీ, నేడు కెసిఆర్ పాలనలో వర్సిఈ ప్రాంగణం కాస్తా సభలు, సమావేశాలను నిషేధించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రొఫెసర్ కాశీంపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయకపోతే టిఎంపిఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ఇంజం సాంబయ్య, మీడియా అధ్యక్షుడు మాదిరి నర్సింగరావు, గ్రేటర్ అధ్యక్షుడు కేశపాక నర్సింగ్, ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ళ వెంకటేశ్, రాష్ట్ర నాయకులు ఏదేల్లి భూపాల్, మచ్చ రాజేశ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో ఉత్సవాలకు మల్లికార్జునస్వామి ఆలయ ముస్తాబు



ఆలయంలో కొలువుదీరిన శ్రీ మల్లికార్జునస్వామి

ఉప్పల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : రామంతాపూర్‌లోని పురాతన శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వంగా సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. సుమారు 150 సంవత్సరాల పూర్వం అప్పటి నైజాం కాలం నాటి రాజుల కాలంలో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. శ్రీశైలం భ్రమరాంభికదేవి ఈ దేవాలయం భ్రమరాంభికదేవి ఒకే విధంగా ఉండుల వల్ల భక్తుల కోరికలు తీర్చుతూ వెలుగొందుచున్నట్లు చరిత్రకారులు చెబుతారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈనెల 15వ తేది నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి వెల్లంకి నరేందర్, మాజీ చైర్మన్ ఎం.దయాకర్ రెడ్డిలు తెలిపారు. ఈనెల 25వ తేదిన గణపతిపూజ అంకురార్పణం, ఈనెల 16వ తేదిన శ్రీ సంతోషిమాత త్రయోవింశతి వార్షికోత్సవ వేడుకలు, ఈనెల 17వ తేదిన శ్రీ భ్రమరాంభిక మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం, ఈనెల 18న మహ శివరాత్రి పర్వదినం, రుద్రాభిషేకములు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే రోజు రాత్రి లింగోద్భవ మహ రుద్రాభిషేకం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా జరిగే పూజా కార్యక్రమాలకు వివిధ పార్టీల నేతలు పాల్గొంటున్నారని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదే విధంగా రామంతాపూర్‌లోని శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో కూడా మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ కోట్ల నరసింహారెడ్డి తెలిపారు.

## హ్యాండ్ రైటింగ్ పరీక్షలో విజేతలకు పురస్కారాలు



జ్ఞాపికలను అందజేస్తున్న సిద్దాల లార్డ్స్ బీరప్ప

సరూర్‌నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా నిర్వహించిన హ్యాండ్ రైటింగ్ ఒలంపియాడ్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన లార్డ్స్ పాఠశాల విద్యార్థులకు పురస్కారాలు లభించాయి. ఈ సందర్భంగా విజేతలైన మీర్‌పేట్ ఆర్ ఎన్‌రెడ్డినగర్ బ్రాంచ్ విద్యార్థులను లార్డ్స్ విద్యా సంస్థల ఛైర్మన్ సిద్దాల బీరప్ప అభినందించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలు విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని కలుగజేశాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిషన్‌రావు, ఇంఛార్జి చంద్రకళ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## యువత శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలి: ఎసిపి శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎసిపి శ్రీదర్‌రెడ్డి

సైదాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: యువత శారీరకంగా, మానసికంగా బలంగాఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని ఎల్‌బినగర్ ఎసిపి శ్రీధర్‌రెడ్డి అన్నారు. పవన్‌పురి కాలనీలోని అల్టిమేట్ ఫిట్నెస్ స్టూడియోలో జరిగిన కార్యక్రమానికి సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, ఎస్‌ఐ రమేష్‌లతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎసిపి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ యువతకు సంపూర్ణ ఆరోగ్యం అవసరమని అన్నారు. ప్రతి రోజు సరైన వ్యాయామం చేయడంవల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గాజుల అరుణ్ కుమార్, బిసి సంక్షేమ సంఘం కార్యదర్శి కొండ యాదగిరి, అశ్విన్, క్రాంతి, శ్యామ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్ గోశాలలో గోవులకు పూజలు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: బాలాపూర్‌లోని గోశాలలో మంగళవారం రాష్ట్ర బిజెపి నాయకుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. గోవులను తల్లిగా భావించి పూజలు చేయాలని, గో హగ్ చేయాలని ప్రధాని మోడి ఇచ్చిన పిలుపు మేరకు ఆయన గోశాలలోని గోవులకు సేవలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవులను పూజించి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత దేశ పౌరులపై ఉందని అన్నారు.

## అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి : అంజనీకుమారి



విద్యార్థులు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న అంజనీకుమారి

మలక్‌పేట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : విద్యార్థులు దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ సిఎస్‌సి కోర్టు సూపరింటెండెంట్ పివిపి అంజనీ కుమారి పేర్కొన్నారు. కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థుల భవిష్యత్తు ప్రణాళికలపై జరిగిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థుల విధానాలు ఎంత ధృడంగా ఉంటే భవిష్యత్తుపై మీ బాధ్యత, సమాజంపట్ల మీ ఆలోచన అంత ఉన్నతంగా ఉంటుందన్నారు. కలలు కనండి, ఆ కలలను సాకారం చేసుకోవడానికి నిరంతరం శ్రమించాలని కలాం ఇచ్చిన సందేశాన్ని విద్యార్థులకు గుర్తు చేసారు. కలలను సాకారం చేసుకోవడానికే విద్య ఒకే మార్గమని, ఆదర్శవంతమైన విద్యార్థులుగా ఎదగాలని కోరారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేసారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణస్వామి, స్పెషల్ ఆఫీసర్ తాబసం బేగం, కలాం విజన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

## హాత్ సే హాత్ జోడో కార్యక్రమం విజయవంతం చేయాలి : దేప



సమావేశంలో మాట్లాడుతున్న దేప భాస్కర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : ఏఐసీసీ పిలుపుతో టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో అభియాన్ పాదయాత్ర మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మొదటి మూడు రోజుల పాదయాత్ర ఆర్కెపురం డివిజన్‌లో బుధవారం ఉదయం అల్కాపురికాలనీ చౌరస్తానుండి గడప గడపకు పాదయాత్ర ప్రారంభం అవుతుందని డివిజన్ అధ్యక్షులు పున్న గణేష్‌నేత తెలిపారు. నియోజకవర్గ, మండల, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ నాయకులు, కార్యకర్తలు, డివిజన్ నాయకులు, పెద్ద ఎత్తున హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు చిలక ఉపేందర్‌రెడ్డి, బండి మధు, శివ, శేఖర్ ముదిరాజ్, పగడాల శ్రీశైలం, కళ్యాణ్, జహంగీర్, మణికంఠ, కృష్ణ, అంజి, నగేష్, బాలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుంది : డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి



డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

తార్నాక, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: టేబుల్ టెన్నీస్ క్రీడాకారులు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విటరన్స్ టేబుల్ టెన్నిస్ అసోషియేషన్ సభ్యులు డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి, టీటీయూసీ కార్మిక విభాగం అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డికి క్యాంపుకార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. లాలాపేట్‌లోని ప్రొజయశంకర్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్ క్రీడాకారులకు అవసరమైన కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయడంతో పాటు రెండు ప్రాక్టీస్ హాల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సందర్శకులకు, క్రీడాకారులకు అవసరమైన టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో డిప్యూటీ మేయర్ స్పందిస్తూ క్రీడాకారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో చీఫ్ కాటన్ కృష్ణ, సెక్రటరీ విఠల్ బేతితో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కంటి పరీక్షలు చేయించుకోవాలి



వివరాలు తెలుసుకుంటున్న మధుకర్‌రెడ్డి

సైదాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: 'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలని భాగ్యనగర్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి అన్నారు. డిఎస్ నగర్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని పరిశీలించిన అనంతర ం ఆయన మాట్లాడుతూ కంటి సంబంధిత సమస్యలు ఉన్న వారందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బొమ్మల ప్రశాంత్, జగన్, శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మాగాంధీ లా కళాశాలలో మెగా రక్తదానం

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : భారతదేశ రక్షణ కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన భారత వీరజవాన్లకి స్మృత్యర్థం పుల్వామా ఉగ్రదాడీలో అమరులైన వీరజవానుల త్యాగలకు గుర్తుగా మహాత్మాగాంధీ లా కాలేజీలో 100యూనిట్ల మెగారక్తదాన శిబిరాన్ని దేప పౌండేషన్ చైర్మన్ దేప భాస్కర్‌రెడ్డి, ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అంజపల్లి నాగమల్లు ముఖ్య అతిధులుగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దేప భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరజవాన్‌ల త్యాగాలను గుర్తించి విద్యార్థులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. గత 33సంవత్సరాలుగా మహాత్మాగాంధీ లా కళాశాల చైర్మన్ గంగుల గోవర్ధన్‌రెడ్డి సేవా కార్యక్రమాలు చేస్తూ కోవిడ్ టైంలో పేద ప్రజలకి నిత్యవసర వస్తువులు, శానిటైజర్లు, మాస్కులు పంపిణీ చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, విద్యార్థులు ప్రశాంత్, మైకేల్, రవి, నితీష్, వెంకటరమణారెడ్డి, శ్రావ్య, గీత, ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు చైతన్య, సురేఖ, స్నేహ, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని తహశిల్దార్‌కు వినతి

జవహర్‌నగర్ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ కార్మికనగర్ సర్వేనెంబర్ 217, 221 రేణుకానగర్‌బస్తీకి ప్రధాన రాకపోకలకు రోడ్డుసమస్య, అంబేద్కర్‌నగర్‌చెరువు పక్కన ఎఫ్‌టిఎల్ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జవహర్‌నగర్ మున్సిపల్ బీజెపి అధ్యక్షులు రంగుల శంకర్ ఆధ్వర్యంలో కాప్రా మండల తహశిల్దర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజెపి నాయకులు కమల్, సునీల్, నాగరాజు, యాదగిరి, శ్రీధర్, క్రిష్ణయ్య, కనకయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎఇ శ్రీనివాస్ తెలిపారు. ఉప్పల్ 11 కెవి రాఘవేంద్రనగర్ కాలనీ ఫీడర్ పరిధిలోని ప్రశాంతినగర్, బీరప్ప గడ్డ, అన్నపూర్ణకాలనీ, బ్యాంక్‌కాలనీ, ధర్మపురికాలనీ, సాయి రాంనగర్, ఈస్ట్ కల్యాణపురి, రాఘవేంద్రనగర్, శ్రీగిరికాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. అదే విధంగా 11 కెవి హెచ్‌ఎండిఏ పరిధిలోని ఉప్పల్ భగాయత్‌లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు తెలిపారు. ఈ అసౌకర్యాన్ని గమనించాలని సూచించారు.

## పుల్వామా అమరులకు ఘనంగా నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న తీగల కృష్ణారెడ్డి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: మీర్‌పేట్ మేడిబౌలిలోని టికెఆర్ ఇంజనీరింగ్‌కాలేజీలో మంగళవారం పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన వీర జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన టికెఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అమర జవాన్లకు పుష్పాంజలి ఘటించి వారి ధైర్య సాహసాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ తీగల హరినాథ్‌రెడ్డి, ట్రెజరర్ తీగల అమర్‌నాథ్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎన్‌సిసి ఇంఛార్జి నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెపికే ప్రజల మద్దతు ఉంది : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



సమావేశంలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి తదితరులు

మలక్‌పేట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : మూసారాంబాగ్ డివిజన్ బాలదానమ్మ బస్తీలో నిర్వహించిన ప్రజా గోస బిజెపి భరోసా కార్నర్ మీటింగ్‌కు కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా గోస కార్నర్ మీటింగ్‌ల ద్వారా తెలంగాణాలో ప్రతి ఇంటికి బిజెపి చేరుకుంటుందన్నారు. ఎంఐఎం, బిఆర్‌ఎస్ పార్టీల అక్రమ కుట్రను బట్టబయలు చేస్తామన్నారు. సమావేశంలో పాల్గొనే వారి శక్తి, ఉత్సాహం, నిరంకుశ బిఆర్‌ఎస్ ప్రభుత్వ అహాన్ని విచ్చినం చేస్తుందని, రాష్ట్రంలో బిజెపి సంక్షేమ ప్రభుత్వాన్ని స్థాపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు సందడి సురేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, జక్క మోహన్, సురేష్, లక్ష్మణ్, శశికాంత్, మోహన్, జైకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి : నగేష్



ఎలక్ట్రానిక్ వస్తువులను సేకరిస్తున్న పెండ్యాల నగేష్

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆర్‌కెపురం డివిజన్ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా లయన్స్‌క్లబ్ నల్గొండ గ్రేటర్ ఆధ్వర్యంలో ఈ వెస్ట్ కార్యక్రమం చిత్రాలేఔట్ కాలనీలో నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పెండ్యాల నగేష్ పాల్గొన్నారు. కాలనీ వాసులు తమ పాత లాప్‌టాప్‌లు, ఫోన్‌లు, కంప్యూటర్‌లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు ఇక్కడ అందజేశారని తెలిపారు. వీటిని రీసైక్లింగ్ యూనిట్‌కి పంపించి పర్యావరణ హిత వస్తువుల తయారికి ఉపయోగిస్తామని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్ తీగల మోహన్‌రావు, క్లబ్ అధ్యక్షులు చేరుపల్లి నర్సింహ, దుబ్బాక వెంకట్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, రవీందర్‌రావు, సుధాకర్‌రెడ్డి, అంజల్‌రావు, నాగార్జునరెడ్డి, చక్రారెడ్డి, ఆనంద్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా నాగార్జున పాఠశాల వార్షికోత్సవ వేడుకలు



వేడుకల్లో ప్రసంగిస్తున్న భాష్యం ఛైర్మన్ విఠల్‌రెడ్డి

వనస్థలిపురం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : వనస్థలిపురంలోని నాగార్జున మాంటేస్సోరీ, ఐఐటీ ఒలింపియాడ్ స్కూల్ 32వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యా సంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యాబోధనలో నాణ్యత ప్రమాణాలకు తమ విద్యా సంస్థల్లో అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ధ్యతోపాటు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం మరియు భావ వ్యక్తీకరణ పెంపొందించడానికి తమ విద్యాసంస్థలలో పలు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గత ఏడాది పదవ తరగతి పరీక్షలలో జీపీఏ 10 పాయింట్లు సాధించిన 29 మంది విద్యార్థులకు 5 వేల రూపాయల నగదు, మెమెంటో ప్రధానం చేశారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్ పర్సన్ రజినీ విఠల్‌రెడ్డి, సీఏఓ ఏ.శేషారావు, అకాడమిక్ డీన్ ఎస్.రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ ఏ.లక్ష్మి, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ్ భారత్ ద్వారా డివిజన్ పరిశుభ్రం



స్వచ్ఛ్ భారత్ ప్రజా చైతన్య కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి

నేరెడ్‌మెట్ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: స్వచ్ఛ్ భారత్ కార్యక్రమం మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని దశల వారిగా నిర్వహిస్తున్నట్లు బిఆర్‌ఎస్ మల్కాజిగిరి సర్కిల్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని నేరెడ్‌మెట్ డివిజన్ సి.బి.ఎస్, ఆర్.కె.పురం ఆఫీసర్స్ కాలనీలో స్వచ్ఛ్ భారత్ మిథ ప్రజా చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై పలు అంశాలను వివరించి, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్సార్ ప్రసాద్, శివ, మహపాత్ర, రామ్‌చందర్, మున్సిపల్ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో జోరుగా కాంగ్రెస్ పార్టీ జోడో యాత్ర



రామంతాపూర్‌లో జోడోయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నేతలు ఎం.పరమేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు

ఉప్పల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని రామంతాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ జోడో యాత్ర జోరుగా సాగుతోంది. రామంతాపూర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహం నుంచి డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జోడో యాత్రలో జనం స్వచ్ఛందంగా తరలివస్తున్నారని తెలిపారు. బిఆర్‌ఎస్, బిజెపి నేతల తీరును నిరసిస్తూ యాత్ర కొనసాగుతుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా అన్ని ప్రాంతాల్లో పర్యటించి సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన యాత్రకు సంఘీభావంగా తమ యాత్ర సాగుతుందని, కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రతినిధులు మేకల శివారెడ్డి, ఎం.డి. తౌఫిక్, సీనియర్ నాయకులు బోరంపేట కృష్ణ, సుర్వి మురళీగౌడ్, తవిడబోయిన గిరిబాబు, సుధాకర్‌రెడ్డి, చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, లుకాస్, ఎం.డి.షఫీ, వినోద్‌గౌడ్, మురళీ, పూస సత్తయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ మున్సిపల్ గ్రౌండ్‌కు సిరిపురం యాదయ్య పేరు పెట్టాలని వినతి



మేయర్, డిప్యూటీ మేయర్‌కు వినతి పత్రాలు ఇస్తున్న కార్పొరేటర్లు, నాయకులు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్ దావూద్‌ఖాన్‌గూడలో నిర్మించిన మున్సిపల్ క్రీడా మైదానానికి తెలంగాణ మలిదశ ఉద్యమ అమరుడు సిరిపురం యాదయ్య పేరును పెట్టాలని కార్పొరేషన్‌కు చెందిన బిఆర్‌ఎస్ నాయకులు, కార్పొరేటర్లు కోరారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్లు స్థానిక కార్పొరేటర్ సూర్లగంటి అర్జున్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, సుక్క శివకుమార్‌లతో పాటు పార్టీ నాయకులు భీమిడి జంగారెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, జెనిగె శ్రీనివాస్ యాదవ్, బిసి సెల్ అధ్యక్షుడు కోటగిరి జంగయ్య తదితరులు మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డిలకు వేర్వేరుగా వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహేశ్వరం మండలం నాగారం గ్రామానికి చెందిన సిరిపురం యాదయ్య తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆత్మ బలిదానం చేసుకొని చిరస్మరణీయులయ్యారన్నారు. అయితే ఆయన జ్ఞాపకార్థం మహేశ్వరం నియోజకవర్గంలో ఏర్పాటైన ప్లే గ్రౌండ్‌కు పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

## లోకాయుక్త కాలనీ భూ వివాదం
### మరోసారి ఉద్రిక్తత - పోలీసులపై రాళ్ల దాడి

సైదాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: సైదాబాద్ లోకాయుక్త కాలనీలోని భూ వివాదం నేపథ్యంలో మరోమారు ఉద్రిక్తత నెలకొంది. లోకాయుక్త కాలనీలోని స్థలంలో చాలా ఏళ్ల నుంచి గుడిసెలు వేసుకుని నివాసముంటున్న వారిని నెల రోజుల క్రితం కోర్టు ఆదేశాలు ఉన్నాయంటూ రెవిన్యూ, పోలీసు అధికారులు భారీ బందోబస్తు మధ్య గుడిసెలు ఖాళీ చేయించారు. అప్పటినుంచి గుడిసెవాసులు తిరిగి ఆస్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. గత రాత్రి గుడిసెవాసులు తిరిగి అక్కడకు చేరుకున్నారన్న సమాచారంతో పోలీసులు అక్కడకు వెళ్లగా కొంత మంది వారిపై రాళ్లను విసిరివేశారు. పోలీసులపై రాళ్లదాడి ఉద్రిక్తతకు దారితీసింది. రాళ్ల దాడిలో పులువురు పోలీసులకు గాయాలు అయ్యాయి. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

## మీర్‌పేట్ బిజెపి సోషల్ మీడియా కన్వీనర్‌గా భాస్కర్

సరూర్‌నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి సోషల్ మీడియా కన్వీనర్‌గా గోగికార్ భాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ ఉత్తర్వులు జారీ చేసి మంగళవారం భాస్కర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్‌లో బిజెపిని సోషల్ మీడియా పరంగా బలోపేతం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. కార్యక్రమంలో బిజెపి ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, పార్టీప్రధాన కార్యదర్శులు కోడూరు సోమేశ్వర్, గాజుల మధు, కార్పొరేటర్ కరుణానిధి పాల్గొన్నారు.

## తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరం : కార్పొరేటర్ రాంబాబు

జవహర్‌నగర్ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: రక్తదానం ప్రాణదానంతో సమానమని జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేటర్ 26వ డివిజన్ పానుగంటి రాంబాబు పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 26వ డివిజన్ చంద్రగిరి కాలనీలో స్వేచ్ఛ వేదిక డైరెక్టర్ రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసేమియాతో బాధపడుతున్న ప్లిలల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరడం జరిగిందన్నారు. ప్రస్తుత యువత ముందుకు వచ్చి ఇలాంటి మంచి కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన యువతను కోరారు. ఈ కార్యక్రమంలో స్వేచ్ఛ వేదిక సొసైటీ కో ఆర్డినేటర్లు బలాజీ, చిరంజీవి, అశోక్, శ్రీకాంత్, చరణ్, అన్వర్, మస్తాన్, ఇస్మైల్, శరన్, గణేష్, సామాజిక కార్యకర్తలు ప్రవీణ్, తలసేమియా సికల్స్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ వంశీ, స్థానికులు పాల్గొన్నారు.

## మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



శంకుస్థాపనలు చేస్తున్న సంక్షేమ సంఘాల నాయకులు

వనస్థలిపురం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : ఎల్‌బినగర్ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. బిఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని పలు కాలనీలలో రూ.6.73కోట్ల అభివృద్ధి పనులను ఆయా కాలనీల సంక్షేమ సంఘంనాయకులు శంకుస్థాపనలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిలు పనులను పర్యవేక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడు తూ నియోజకవర్గంలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఎల్‌బినగర్‌వద్ద ప్లై ఓవర్లు, అండర్‌పాస్ బ్రిడ్జిలతో ట్రాఫిక్ సమస్య తగ్గిందని, నాగోల్ నుండి మంద మల్లమ్మ వరకు రోడ్డుకు ఇరువైపుల సైకిల్ ట్రాక్‌ను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఆయాకాలనీలలో అభివృద్ధి పనులను సంక్షేమ సంఘం నాయకులు శంకుస్థాప నలు, ప్రారంభోత్సవాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమం లో బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, నాయకులు సామ బుచ్చిరెడ్డి, అనిల్‌చౌదరి, భూపాల్‌రెడ్డి, తిరుమలేష్, మల్లారెడ్డి, కృష్ణారెడ్డి, పోగుల రాంబాబు, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్ శాంతిశేఖర్



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న శాంతిశేఖర్

నాచారం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: నాచారం డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్ కాలనీలో రూ.10లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను మంగళవారం కార్పొరేటర్ శాంతిసాయిజన్ శేఖర్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో మరికొన్ని ప్రాంతాల్లో కొత్త రోడ్లను వేయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు విఠల్ యాదవ్, రాజబాబు, కట్ట బుచ్చన్న గౌడ్, పాండు నాయక్, అనిల్, సాయిజన్ శేఖర్, వర్క్ ఇన్స్‌పెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆందోల్ మైసమ్మ ఆలయంలో పూజలు



ఆందోల్ మైసమ్మ ఆలయాన్ని దర్శించుకున్న లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : యాద్రాది జిల్లా దండు మల్కాపురంవద్ద ఉన్న ఆందోల్ మైసమ్మ ఆలయంలో ఉప్పల్ నియోజకవర్గ బిఆర్‌ఎస్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అమ్మవారి దయతో ఉప్పల్ నియోజకవర్గం ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి నేతలు బండారి లక్ష్మారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటి నేతలు, బిఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ అహల్యకు ఓయు డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న డాక్టర్ కూరెళ్ళ అహల్య

నేరెడ్‌మెట్ ఫిబ్రవరి14 ప్రభాతవార్త: మల్కాజిగిరి ప్రభుత్వ కళాశాలలో సంస్కృత లెక్చరర్‌గా పనిచేస్తున్న డాక్టర్ అహల్యకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ప్రముఖ ప్రొఫెసర్ నీలకంఠం పర్యవేక్షణలో సంస్కృత భాషా మరియు సాహిత్యానికి పరిశోధన చేసినందుకు గాను ఆమెకు డాక్టరేట్‌ను ప్రధానం చేయబోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శైలజ, సిబ్బంది ఆమెను అభినందించారు. సాస్కృత భాషాభివృద్ధికి ఆమె ఎంతో కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యసాధనకోసం కృషి చేయాలి : అంకమ్మరావు



సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మలక్‌పేట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : దిల్‌సుక్‌నగర్ భాష్యం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భాష్యం జోనల్ ఇంఛార్జి అంకమ్మరావు, ప్రిన్సిపల్ పల్లవిలు విచ్చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు 10వ తరగతినుండి తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడానికి మంచి లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటి సాధన కోసం కృషి చేయాలన్నారు. పరీక్షలంటే భయపడకుండా ఖచ్చితమైన సమయపాలన పాటిస్తూ ప్రిపరేషన్‌కు సమయాన్ని చక్కగా వినియోగించుకోవాలని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చాంప్స్ ప్రిన్సిపల్ భానుమతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.